నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, ఆదివారం 16 ఫిబ్రవరి 2025 | MEDAK

కేసీఆర్‌ను కలిసిన ఎన్ఆర్ఐ దంపతులు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో ఎన్ఆర్ఐ దంపతులు పెడతల బాలమణిరెడ్డి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 15 : బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను శనివారం వ్యవసాయ క్షేత్రంలో మండలంలోని ముస్త్యాల గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ దంపతులు పెడతల బాలమణిరెడ్డి ప్రతాప్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వారితో సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెడతల ఎల్లారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముస్త్యాల బాల్ నర్సయ్య, మాజీ సర్పంచ్ ముస్త్యాల అరుణ, యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, కొంగరి గిరిధర్, ఏర్పుల మహేశ్, అరిగే కనకయ్య, పచ్చిమడ్ల మానస, దినేశ్ తివారీ, భూమిగారి రాజేందర్, ఎర్రోళ్ల యాదగిరి, యాట భిక్షపతి, బండోజు భాస్కర్ తదితరులు ఉన్నారు.

నల్లవల్లిలో అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేస్తున్న కొత్తపల్లి, నల్లవల్లి యువకులు

రికార్డులు సృష్టించి.. డబ్బులు డ్రా చేసి

బుస్సాపూర్‌లో ఉపాధి హామీ పనుల్లో భారీగా అక్రమాలు

- అందినకాడికి దోచుకుతిన్న మాజీ సర్పంచ్
- పనులు చేయకున్నా చేసినట్లు రికార్డులు
- కుటుంబసభ్యుల పేర్లమీద ఈజీఎస్ బిల్లులు డ్రా
- గ్రామానికి 7 కల్లాలు మంజూరైతే 6 తన కుటుంబానికే కేటాయింపు
- పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని బుస్సాపూర్ గ్రామస్తుల డిమాండ్

సిద్దిపేట, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ ప్రతినిధి): సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి కృషిచేయాల్సిన ఆయన సొంతింటిని చక్కబెట్టుకున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఈజీఎస్) పనుల్లో అందిన కాడికి దోచుకుని సొమ్ముచేసుకున్నారు. సిద్దిపేట రూరల్ మండల బుస్సాపూర్‌లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ (ఈజీఎస్) పనుల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. తాజా మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి తన కుటుంబసభ్యుల పేర్ల మీద పనులు చేయకున్నా చేసినట్టు రికార్డులు చేయించి అక్రమంగా బిల్లులు డ్రా చేసుకున్నారు. క్యాటిల్ షెడ్, అవెన్యూ ప్లాంటేషన్, పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణాలు, గ్రామంలో చేపట్టిన ప్రతి పనిలో అక్రమాలు జరిగాయి.

 గ్రామంలో ఉపాధి హామీలో చేపట్టిన పనుల్లో తన కుటుంబ సభ్యులు పనులు చేశారని చూపిన రికార్డు

కుటుంబ సభ్యుల పేర్లమీద డబ్బులు డ్రా..

బుస్సాపూర్ తాజా గ్రామ మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇష్టానుసారంగా వ్యవహరించారు. పదవిలో ఉండగా ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు పనులు చేయకపోయినా చేసినట్లు రికార్డు చేయించి వారి పేర్ల మీద డబ్బులు డ్రా చేశారు. ఆయన భార్య సిద్దిపేటలో ఉంటుంది. ఏనాడు గ్రామంలో ఉపాధిహామీ పనులకు హాజరు కాలేదు. కానీ, ఆమె పేరిట గ్రామంలో అవెన్యూ ప్లాంటేషన్, వివిధ పనులు చేపట్టినట్లు ఐడీ నెంబర్ (010714) మీద బిల్లు రికార్డు చేసి రూ. 57,303 డబ్బులు తీసుకున్నారు. సర్పంచ్ పెద్దన్న రాజిరెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఆయన కర్ణాటకలో ఉద్యోగం చేస్తున్నారు. ఆయన పేరిట గ్రామంలో ప్లాంటేషన్, కాంపౌండ్ వాల్ నిర్మాణం, ఇతర పనులు చేసినట్లు ఐడీ నెంబర్ (010718) మీద పని దినాలు రికార్డు చేసి బిల్లులు చేశారు. ఈయన ఎప్పుడు కూడా ఉపాధిహామీ పనికి పోయింది లేదు. ఈయన వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో రూ. 30,376 జమయ్యాయి. ఇక మాజీ సర్పంచ్ తండ్రి సత్యనారాయణరెడ్డి గ్రామంలోనే ఉంటారు. ఆయన ఉపాధిహామీ పనులకు పోడు. కానీ, గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో ఈయన ఐడీ 010251 మీద ఎంపీపీఎస్ బుస్సాపూర్ పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణ పనులు చేసినట్లు రికార్డు చేశారు. ఈయన పేరిట రూ. 19,490 డ్రా చేసుకున్నారు. తల్లి జయమ్మ పేరు మీద ఐడీ నెంబర్ 010679 మీద రూ. 11,149 తో పాటు సీసీ నిర్మాణంలో పని చేసినట్లు డబ్బులు డ్రా చేసుకున్నారు. గ్రామంలో పాత కిచెన్ షెడ్డు మీద బిల్లులు డ్రా చేశారు. ఇలా ఒకటి ఏమిటి ఏది దొరికితే దాని మీద కుటుంబ సభ్యుల పేర్ల మీద రికార్డులు చేయించి మాజీ సర్పంచ్ బిల్లులు తీసుకున్నారు. గ్రామంలో చేపట్టిన ప్రతి పనిలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.

 గ్రామంలో ఉపాధి హామీ పనులు తన కుటుంబ సభ్యులు పనులు చేశారని చూపిన రికార్డు

7 కల్లాల్లో 6 కుటుంబ సభ్యులకే...

ఉపాధిహామీ పథకంలో వ్యవసాయ బావుల వద్ద కల్లాలు నిర్మించుకోవడానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. బుస్సాపూర్ గ్రామానికి 7కల్లాలు మంజూరయ్యాయి. గ్రామంలో ఏ రైతుకు ఇవ్వకుండా మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి తన కుటుంబ సభ్యుల పేర్ల మీదనే 6 కల్లాలు మంజూరు చేయించుకొని నిర్మాణం చేసుకున్నారు. ఒకటి మాత్రమే ఇతర రైతుకు కేటాయించారు. దీనిపై గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము ధాన్యం పోద్దామంటే కల్లాలు లేక రోడ్ల మీద పోసుకుంటున్నామని రైతులు తెలిపారు. తాజా మాజీ సర్పంచ్ తన అధికారంతో గ్రామానికి వచ్చిన పనులన్నీ తన కుటుంబ సభ్యులకే కేటాయించారని ఆరోపించారు. గ్రామంలో విద్యుత్ దీపాల బిల్లుల్లో సైతం భారీగా అక్రమాలు జరిగినట్లు తెలిసింది. ఫిజికల్‌గా ఒకటి చూపించి రికార్డులో మరోటి చూపి వేల రూపాయలు కాజేసినట్లు తెలిసింది. తన ఇంట్లో పెట్టుకున్న బల్బులు రికార్డులో చూపించారు. విద్యుత్ బిల్లులపైనే దాదాపుగా వేల రూపాయల కుంభకోణం జరిగింది. గ్రామంలో ఈ మధ్య కాలంలో జరిగిన వాటిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తే మరిన్ని వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు మల్లన్న ఐదో ఆదివారం

చేర్యాల, ఫిబ్రవరి 15: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లిఖార్జున స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదో ఆదివారం(నేడు) ఉత్సవాలకు సుమారు 50వేల మంది భక్తులు తరలిరానున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులు మల్లన్నను దర్శించుకొని పట్నాలు వేసి, బోనాలు సమర్పిస్తారు. మహామండపం, గంగరేగు చెట్టు ఆవరణ, బసచేసే గదుల వద్ద పట్నాలు వేయనున్నారు. మల్లన్న గుట్టపైన ఎల్లమ్మకు బోనాలు సమర్పిస్తారు. అనంతరం కొండపోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాలకు తరలివెళ్లి అక్కడ బోనాలు సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతున్నది. ఆలయ ఈవో రామాంజనేయులు, పాలక మండలి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

- రైతు జేఏసీ, మహిళా సంఘాల డిమాండ్
- డంపింగ్‌యార్డు ముట్టడికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు
- నల్లవల్లిలో అర్ధనగ్న ప్రదర్శనలతో నిరసన
- గుమ్మడిదలలో రిలే నిరాహార దీక్షలో మైనార్టీలు
- బొంతపల్లిలో ఎడ్లబండ్లపై, ట్రాక్టర్లతో.. గుమ్మడిదలలో ఆటో ర్యాలీలతో హైవేపై నిరసన


ప్యారానగర్ డంపింగ్‌యార్డు ముట్టడికి తరలిన మహిళా, రైతు జేఏసీ నాయకులు

మా బతుకులు ఆగంజేస్తరా..

డంపింగ్ యార్డు ఏర్పాటును ప్రభుత్వం వెంటనే విరవించుకోవాలి

గుమ్మడిదల, ఫిబ్రవరి 15: పార్యానగర్‌లో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డు ఏర్పాటును విరమించుకోవాలని ఆందోళనలు కొనసాగుతున్నాయి. బాధిత గ్రామాల్లో రోజుకో తీరుతో నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నారు. శనివారం గుమ్మడిదలలో రైతు జేఏసీ కమిటీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వందల సంఖ్యలో ఆటోలు నడిపి జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. డంపింగ్‌యార్డును రద్దు చేయాలంటూ గుమ్మడిదల నుంచి దోమడుగు వరకు ర్యాలీ నిర్వహించారు. తిరుగు ప్రయాణంలో జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు, రైతులు, మహిళా సంఘాలు సభ్యులు, యువజన సంఘాల సభ్యులు జాతీయ రహదారి మీదుగా ర్యాలీగా డంపింగ్ యార్డు వద్దకు వెళ్లారు. డంపింగ్‌యార్డు మాకొద్దు.. జై జవాన్.. జై కిసాన్, సేవ్ ఫార్మర్, సేవ్ ఫారెస్ట్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. జైజవాన్, జైకిసాన్ అంటూ మహిళల నినాదాలు చేశారు. తోపులాట జరిగినప్పుడు మహిళలను నియంత్రించడానికి మహిళా పోలీసులు లేకపోవడం గమనార్హం. అనంతరం మహిళా పోలీసులు వచ్చారు. డంపింగ్‌యార్డు నిర్మాణాలు చేపడితే ఇక ఊరుకునేది లేదు.. ఎందాకైనా పోతామని హెచ్చరించారు. గుమ్మడిదలలో శనివారం 5వ రోజు రిలే నిరాహార దీక్షలో మున్సిపల్‌లోని మైనార్టీలు కూర్చున్నారు. నల్లవల్లిలో 11వ రోజు రిలే నిరాహార దీక్షలో గ్రామ జేఏసీ నాయకులు అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. బొంతపల్లిలో రైతు జేఏసీ నాయకులు నాగేందర్‌గౌడ్, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, సద్దివిజయభాస్కర్‌రెడ్డి, రాజు, గ్యారల మల్లేశ్, సుంకరిశంకర్, సంజీవరెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు ఆధ్వర్యంలో ఎడ్లబండ్లపై గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా రైతుజేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఇప్పటికే పారిశ్రామిక కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, డంపింగ్ యార్డు ఏర్పాటైతే తమ బతుకులు ఇక ఆగమే అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి పరిశ్రమల కాలుష్యం, డంపింగ్‌యార్డు వ్యర్థాలతో బతకలేమన్నారు. భూగర్భజలాలు కలుషితమవుతాయని, భూములున్నా పంటలు వేసుకోలేని దుస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 11 రోజులుగా నిరసనలు చేస్తున్నా సర్కారు మొద్దునిద్ర వీడక పోవడం సరికాదన్నారు. వెంటనే డంపింగ్‌యార్డు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనల్లో రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, ఆలయకమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, రైతు జేఏసీ కమిటీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి, మహిళా జేఏసీ అధ్యక్షురాలు మల్లమ్మ, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, పుట్ట నర్సింగ్‌రావు, మాజీ ఎంపీపీ సద్దివిజయభాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మైనార్టీ నాయకుడు హుస్సేన్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కాలకంటి రవీందర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, చక్రపాణి, గోపాల్, వేణు, శంకర్‌యాదవ్, కుమార్, ఫయాజ్ షరీఫ్, కుమ్మరి ఆంజనేయులు, రామకృష్ణ, మల్లేశ్ గౌడ్, చాపల మధు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బొంతపల్లిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు


గుమ్మడిదలలో రిలే నిరాహార దీక్ష చేపట్టిన మైనారిటీలు

బీజేపీ వైఖరిని స్పష్టం చేయాలి

- మోదీ పుట్టుకతో బీసీ కాదని కిషన్‌రెడ్డి ఒప్పుకున్నారు
- రాష్ట్రంలో జరుగనున్న రీసర్వేకు ప్రజలు సహకరించాలి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఫిబ్రవరి 15: రాష్ట్రంలోని బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడంలో బీజేపీ వైఖరిని స్పష్టం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. బీజేపీ స్టాండ్ ఏమిటో చెప్పకుండా మోదీ కులాన్ని అడ్డం పెట్టుకొని తప్పించుకునే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ నాయకులు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా రాష్ట్రంలో సంపూర్ణంగా కులగణన విజయవంతం చేసి అసెంబ్లీలో తీర్మానం అనంతరం కేంద్రానికి పంపుతామని, బీసీలకు 42శాతం రిజర్వేషన్ చేయడంలో ఆలస్యం చేస్తే కేంద్రంపై ఉద్యమం తప్పదని ఆయన స్పష్టం చేశారు. శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పుట్టుకతో బీసీ కాదని స్వయంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఒప్పుకున్నారని, ఇందులో సీఎం రేవంత్‌రెడ్డిని తప్పుపట్టాల్సిన అవసరమేమిటని ప్రశ్నించారు. పుట్టుకతో ఓసీ కాబట్టి అదే పంథాలో పోయి మోదీ బీసీలకు అన్యాయం చేసే అవకాశం ఉందన్నారు. షెడ్యూల్ 9లో పెట్టి బీసీల రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని, దీనిపై బీజేపీ కేంద్ర మంత్రులు, ఎంపీల వైఖరేంటో చెప్పాలన్నారు. రాష్ట్రంలో కుల గణన సంపూర్ణమైతే దేశవ్యాప్తంగా చేయాలనే డిమాండ్లు వస్తాయనే భయంతోనే బీజేపీ కేంద్ర మంత్రులు విమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు. బీసీల రిజర్వేషన్‌కు మద్దతు తెలుపకుంటే బీసీ ద్రోహులుగా మిగిలిపోతారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా రాష్ట్రంలో చేపట్టిన కులగణన సర్వే సంపూర్ణంగా కాలేదని తామే ఒప్పుకున్నామని, అందుకే ఈ నెల 16నుంచి 28వరకు రీసర్వే చేస్తున్నామని, ఇందుకు ప్రజలు, ప్రతిపక్ష పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. సమావేశంలో సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, నాయకులు బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి, మంజులారెడ్డి పాల్గొన్నారు.

వేగంగా.. సులభంగా

వ్యవసాయ పనుల్లో ఆధునిక సాంకేతికతను రైతులు అందిపుచ్చుకుంటున్నారు. మెల్లిమెల్లిగా సాగు పనుల్లో టెక్నాలజీని వినియోగిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కందిలో శనివారం వరి పొలానికి రైతు డ్రోన్‌తో క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తుండగా 'నమస్తే తెలంగాణ' క్లిక్‌మనిపించింది. ఈ సందర్భంగా రైతును పలకరించగా.. డ్రోన్ సహాయంతో సులభంగా క్రిమిసంహారక మందు పిచికారీ పూర్తి అవుతున్నట్లు తెలిపారు. దీనిద్వారా కూలీల కొరత అధిగమించడంతో పాటు ఖర్చు, సమయం కలిసి వస్తున్నట్లు తెలిపారు. – నమస్తే తెలంగాణ సంగారెడ్డి ఫొటోగ్రాఫర్, ఫిబ్రవరి 15

కళతప్పిన పల్లెలు..!

ప్రత్యేకాధికారుల పాలనకు ఏడాది పూర్తి

- నిధులు లేక గ్రామాల్లో కుంటుపడిన అభివృద్ధి
- పెండింగ్‌లో రూ.25 కోట్ల బకాయిలు
- మెదక్ జిల్లాలో ఆస్తిపన్ను వసూలు 62 శాతమే..
- పంచాయతీల్లో ఎక్కడి సమస్యలు అక్కడే
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

మెదక్, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పాలనకు ఏడాది కావస్తున్నది. గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో పంచాయతీలకు నిధులు విడుదల కావడం లేదు. దీంతో గ్రామాల్లో సమస్యలు తిష్టవేశాయి. నిధుల లేమితో పంచాయతీ కార్యదర్శులు పనులు చేయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది కార్యదర్శులు అప్పులు తెచ్చి పంచాయతీ కార్మికుల వేతనాలను చెల్లిస్తున్నారు.

మెదక్ జిల్లాలో 21 మండలాలు... 469 జీపీలు...

మెదక్ జిల్లాలో 21 మండలాలు ఉండగా, 469 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గతేడాది ఫిబ్రవరి 1న పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. 2వ తేదీన గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హెచ్ఎంలతో పాటు ఇతర అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది. ఏడాది కాలంగా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే గ్రాంట్లు విడుదల కావడం లేదు. దీంతో పంచాయతీల్లో సమస్యలు పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో 469 గ్రామ పంచాయతీలు ఉండగా, ప్రతి పంచాయతీకి కార్యదర్శి ఉన్నారు. 1629 మంది పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారు. పంచాయతీల్లో 500 జనాభా ఉన్న పంచాయతీలకు ఇద్దరు చొప్పున కార్మికులు పనిచేస్తుండగా, 1000 జనాభా ఉన్న పంచాయతీలకు ముగ్గురు, 1500 జనాభా ఉన్న పంచాయతీలకు నలుగురు, మేజర్ గ్రామ పంచాయతీల్లో 15 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. వీరు మురుగు కాలువలు, రోడ్లను శుభ్రం చేయడం లాంటి పనులు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీలకు వచ్చే పన్నుల వసూళ్లతో కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్నారు. డిసెంబర్ వరకు కార్మికుల వేతనాలు చెల్లించారు. జనవరి నుంచి ప్రభుత్వం నేరుగా కార్మికుల ఖాతాల్లో వేతనాలు జమ చేస్తోంది.

ప్రత్యేక పాలన పొడిగించేనా...?

గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలనను పొడిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రతి ఐదేండ్లకు ఒకసారి అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వమైనా గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జడ్పీ పాలకవర్గాల గడువుకు ముందే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. గతేడాది డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో అప్పటి వరకు గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ అసాధ్యమని తాత్కాలికంగా వాయిదా వేసి ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ఆరు నెలల్లోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, మరో ఆరు నెలలు పొడిగించింది. ప్రస్తుతం పన్నెండు నెలలు పూర్తవుతున్నా గ్రామ పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. ఇప్పటికే ఓటర్ల తుది జాబితా ప్రకటించి బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. సర్పంచ్ అభ్యర్థుల గుర్తులను సైతం కేటాయించి బ్యాలెట్ పేపర్లను ముద్రించారు. ఫిబ్రవరి చివరి వారంలోపు ఎన్నికలు ఉంటాయని భావిస్తున్నప్పటికీ, బీసీ రిజర్వేషన్లపై ఇంకా స్పష్టత రాకపోవడంతో ఆలస్యమయే అవకాశాలు కనిపిస్తున్నాయి. మార్చి, ఏప్రిల్‌లో పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ఉండడంతో ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించక పోవచ్చని అధికారులు భావిస్తున్నారు.

రూ.25 కోట్ల బకాయిలు...

మెదక్ జిల్లాల్లోని గ్రామ పంచాయతీలకు సుమారు రూ.25కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామ పంచాయతీల నిర్వహణ కోసం, సీసీ రోడ్లు, వీధిలైట్లు, తాగునీటి పైపులైన్ లీకేజీల మరమ్మతులు, ఇతర పనుల కోసం మాజీ సర్పంచులు డబ్బులు ఖర్చు చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయనుకున్న మాజీ సర్పంచులకు షాక్ తగిలింది. ఏడాది గడిచినా నేటికి బిల్లుల చెల్లింపు జరగలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వారు తమ నిరసనలు తెలిపారు. కానీ, ప్రభుత్వం స్పందించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

62 శాతమే పన్ను వసూలు...

2024-2025 ఆర్థిక సంవత్సరానికి మెదక్ జిల్లాలో రూ.12.46 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.7.71 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ఇంకా రూ.4.74 కోట్ల వరకు పన్నులు వసూలు కావాల్సి ఉంది. జిల్లాలో కేవలం 62శాతం ఆస్తి పన్ను వసూళ్లు మాత్రమే అయ్యాయి. పన్ను వసూళ్ల కోసం మార్చి 31 వరకు గడువు ఉంది. పన్ను వసూళ్లలో రాష్ట్రంలో మెదక్ జిల్లా పదో స్థానంలో ఉంది. ఎన్నికల హడావిడి, ప్రజాపాలనపై దృష్టి కేంద్రీకరించడం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇలా అన్ని పథకాలపై పంచాయతీ అధికారులు దృష్టిపెట్టడంతో ఆస్తి పన్నుల వసూళ్లలో ఆలస్యమైనట్టు తెలుస్తోంది.

ప్రజలకు ఇబ్బందులు రానివ్వం..

గ్రామపంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఉన్న నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ముఖ్యంగా తాగునీటి సమస్య, వీధిలైట్లు, పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టిసారించాం. డిసెంబర్ వరకు పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాం. సర్కార్ ఆదేశాలతో పరిపాలనలో లోటుపాట్లు లేకుండా ప్రజలకు సేవలందిస్తున్నాం. – యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి, మెదక్

మౌలిక వసతులతోనే గుణాత్మక విద్య

- పీఎం శ్రీ పథకం కింద 44 పాఠశాలలు ఎంపిక
- క్రీడలు, నైపుణ్యాభివృద్ధికి పీఎం శ్రీ పథకం నిధులు
- పీఆర్, విద్యాశాఖ అధికారుల సమావేశంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి

మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 15: గుణాత్మక విద్య అందించాలంటే పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పీఎం శ్రీ పథకం కింద 44 పాఠశాలలు ఎంపికయ్యాయని తెలిపారు. ఎంపికైన ఆయా పాఠశాలల్లో పీఎం శ్రీ పథకం కింద మంజూరైన నిధులతో క్రీడలు, నైపుణ్యాభివృద్ధికి వినియోగించాలన్నారు. సర్వశిక్షా అభియాన్, పీఎం శ్రీ పథకం నిధులతో పాఠశాలల అభివృద్ధి పనులు నాణ్యతగా జరగాలన్నారు. కిచెన్ గార్డ్‌మ ఫీల్డ్ విజిట్, ఎల్ఈడీ లైటింగ్, లైబ్రరీ అభివృద్ధి, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, ల్యాబ్ ఏర్పాట్లు స్పోర్ట్స్ కిట్ల వంటి తదితర అభివృద్ధి పనులకు వినియోగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఈవో వెంకటేశ్వర్లు, పీఆర్ ఈఈ జగదీశ్, జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఎంఈవోలు, ఇంజనీరింగ్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ 2008 అభ్యర్థులకు పోస్టింగ్‌లు

ఇదిలా ఉండగా, శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మాధురి డీఎస్సీ 2008 అభ్యర్థులకు పోస్టింగ్ కల్పించారు. 67 మంది అభ్యర్థులకు 2024-25 విద్యా సంవత్సరానికి గాను కాంట్రాక్టు పద్ధతిలో నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈనెల 17న సంబంధిత మండల విద్యాధికారి కార్యాలయంలో ఫిజికల్ సర్టిఫికేట్‌తో రిపోర్ట్ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

సీఆర్పీల ఆందోళన

తూప్రాన్, ఫిబ్రవరి 15: చేగుంట మండలం కర్నాల్‌పల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే మండలం జేత్రరామ్‌తండాకు చెందిన రమేశ్, చందాయిపేటకు చెందిన ఎర్ర శ్రీనివాస్ మృతిచెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తూప్రాన్ ఏరియా దవాఖానకు పోలీసులు తరలించారు. కాగా, జిల్లా నలుమూలల నుంచి శనివారం తూప్రాన్‌లోని మార్చురీకి చేరుకున్న సీఆర్పీలు మృతుల కుటుంబీకులకు రూ. 30 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకోవాలని దవాఖాన ఎదుట ఆందోళనకు దిగగా, పోలీసులు పెద్దఎత్తున మోహరించి ఆందోళనకారులను సముదాయించారు. మృతులిద్దరూ చేగుంట మండలంలో సీఆర్పీలుగా